అంకితభావమే బాధ్యతకు నిదర్శనం


ఈశ్వరయ్యను సన్మానించిన డీఎస్పీ

పెళ్లకూరు: విధి నిర్వహణలో అంకితభావంతో బాధ్యతలు ముగించడం జీవితంలో ఒక విశిష్ట ఘట్టమని నాయుడుపేట డీఎస్పీ ఎం రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా ఉద్యోగ విరమణ చేసిన ఈశ్వరయ్యను మంగళవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. సీఐ సోమయ్య, ఎస్‌ఐ కృష్ణారెడ్డి, ఏఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

కలువాయి: కలువాయిలోని చౌకధరల దుకాణాలపై విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. కలువాయి దళితవాడలోని 13వ నంబర్ దుకాణంలో 3 వేల కిలోలకు పైగా బియ్యం నిల్వలేకపోవడాన్ని గుర్తించి కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ పెంచలరెడ్డి, డీటీ రవి పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ రాజకీయం నేర్చుకో!


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరురూరల్: వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన నిరాధార ఆరోపణలకు ప్రజాగ్రహానికి గురై తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని పవన్ రాజకీయం నేర్చుకోవాలని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థ దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి ఓర్వలేక చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రజాభిమానం ఎలా పొందాలో జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు.

పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకో

గూడూరురూరల్: వలంటీర్లపై అభాండాలు మోపితే మూల్యం చెల్లించుకోకతప్పదని.. నోరు అదుపులో పెట్టుకో అంటూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఘాటుగా విమర్శించారు. మంగళవారం గూడూరు సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు పవన్ కల్యాణ్ వారికి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి సత్వర సేవలు అందిస్తున్నారన్నారు. చంద్రబాబుకు ఆటబొమ్మగా మారిన పవన్ కల్యాణ్ నోటికొచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. దమ్ముంటే చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు.

పవన్ క్షమాపణలు చెప్పాలి

ఓజిలి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న గ్రామ వలంటీర్లకు పవన్‌కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కురుగొండ సహకార సంఘం అధ్యక్షురాలు ఉచ్చూరు శోభారాణి అన్నారు. మానమాల గ్రామంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు చూసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పవన్ వలంటీర్లపై నీచ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. రెండు చోట్ల ఓడిపోయిన పవన్ మతిభ్రమించి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు పవన్‌కు తగిన బుద్ధిచెప్తారని ఆమె తెలిపారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,730
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,454
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,100
రిటైల్ వెండి గ్రాము	రూ.75.10

పేకాటరాయుళ్లు అరెస్ట్

వెంకటగిరిరూరల్: పట్టణంలోని బంగారుపేట కైవల్యానది కలుజు సమీపంలోని ముళ్లపొదల్లో ఆడుతున్న పేకాట స్థావరంపై సెబ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7,410 నగదు స్వాధీనం పరుచుకున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు. సెబ్ ఎస్‌ఐ గంగాధర్, సివిల్ ఎస్‌ఐ నరసింహారావు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పెళ్లకూరు: మండలంలోని ఎగువతాగేలి గ్రామానికి చెందిన ఎడిచర్ల చంద్రబాబు(30) సోమవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. చంద్రబాబు కటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా, స్థానికులు గుర్తించి హుటాహుటిన శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చంద్రబాబు మంగళవారం మృతిచెందారు. మృతునికి భార్య భారతి, కుమారుడు శశికుమార్, కుమార్తె సౌమ్య ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు

రాపూరు: నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, తెగచర్ల గ్రామ చెరువు వద్ద అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న మూడు ఎర్రచందనం దుంగలు, కారును టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి కారకులైన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు రాపూరు అటవీ రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుపతికి చెందిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, గోనుపల్లి అటవీశాఖ, బేస్ క్యాంప్ సిబ్బంది సోమవారం రాత్రి పెంచలకోన అడవుల్లో కూంబింగ్ నిర్వహించగా, వైఎస్సార్ జిల్లా చిట్వేలి అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికినట్లు గుర్తించి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జాతీయ రహదారికి సమీపంలోని రాపూరు మండలం, తెగచర్ల గ్రామ చెరువు వద్ద ఉన్న కారును గుర్తించి అక్కడే కాపు కాయగా అడవుల్లో నుంచి ముగ్గురు వ్యక్తులు మూడు ఎర్రచందనం దుంగలతో కారు వద్దకు రావడంతో సిబ్బంది మూకుమ్మడిగా వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న వంటసామగ్రితో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ముగ్గురూ తమిళనాడు రాష్ట్రం, సేలంకు చెందిన వారిగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్టు వివరించారు. కూంబింగ్‌లో తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఆర్‌ఎస్‌ఐ వినోద్‌కుమార్, గోనుపల్లి డీఆర్వో మస్తానయ్య, సిబ్బంది ఫరీద్, ప్రవీణ్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న మైనారిటీ మత పెద్దలు, నాయకులు

కలువాయి: కలువాయి మండలంలో మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, మసీదులు, ఈద్గాలతో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు మొహమ్మద్ రసూల్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. స్థానిక మసీదుల్లో మైనారిటీ మత పెద్దలతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యయన కమిటీ సభ్యుడు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక యజ్‌దానీ బాషా, సయ్యద్ హబీబుల్లా పాల్గొన్నారు.

తెలుగుగంగ కాలువలో దూకి మహిళ గల్లంతు


గల్లంతైన మహేశ్వరి (ఫైల్)

వెంకటగిరిరూరల్: 'హలో.. ఏమండీ వంటగది డబ్బా కింద రూ.1,700 డబ్బులు పెట్టాను తీసుకోండి.. మీరు పిల్లలు జాగ్రత్త.. నేను తెలుగు గంగ కాలువ దగ్గర ఉన్నా' అంటూ ఓ మహిళ తన భర్తతో ఫోన్‌లో మాట్లాడి తెలుగుగంగ కాలువలో దిగి గల్లంతైంది. ఈ ఘటన వెంకటగిరి రూరల్ మండలం కలపాడు గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఆమె భర్త కథనం మేరకు.. డక్కిలి మండలం ఎగువ లింగసముద్రం గ్రామానికి చెందిన వేముల మహేశ్వరి (38), ఆమె భర్త తిరుపాలయ్య, కుమారులు పవన్, కార్తీక్‌తో కలిసి గత కొన్ని సంవత్సరాల నుంచి వెంకటగిరిలోని రాణిపేటలో జీవనం సాగిస్తున్నారు. మహేశ్వరి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన కాళ్లకు ఉన్న పట్టీలు తీసి ఇంట్లోనే పెట్టి పర్సు తీసుకుని రాపూరుకు వెళ్లే బస్సు ఎక్కి డక్కిలి మండలం పలుగోడుకు టికెట్ తీసుకుంది. అయితే కలపాడు తెలుగుగంగ కాలువ వద్దకు వచ్చేసరికే మహేశ్వరి బస్సు దిగేసి కలపాడు గ్రామం వైపుగా కట్టమీద నడుచుకుంటూ వెళ్లింది. తన భార్య ఇంట్లో లేదని తెలుసుకున్న భర్త తిరుపాలయ్య మహేశ్వరికి పలుమార్లు ఫోన్ చేయగా మహేశ్వరి తిరిగి భర్తకు ఫోన్‌చేసి 'ఏమండీ ఇంట్లో వంట గది డబ్బాల కింద రూ.1,700 నగదు ఉంది. అవి తీసుకోండి.. పిల్లలు, మీరు జాగ్రత్తగా ఉండండి' అంటూ ఫోన్‌లో మాట్లాడింది. కంగారు పడిన భర్త తిరుపాలయ్య మహేశ్వరిని గట్టిగా ప్రశ్నించగా కలపాడు వద్ద తెలుగుగంగ కాలువలో దూకి చనిపోతున్నట్లు తెలిపింది. దీంతో తిరుపాలయ్య కుటుంబ సభ్యులతో హుటాహుటిన ఘటనా స్థలం వద్దకు చేరుకున్నాడు. తెలుగుగంగ కాలువ ఒడ్డుపై తన భార్య పర్సు, చెప్పులు వదిలేసి కాలువలోకి జారినట్లు ఆనవాళ్లు గుర్తించాడు. ఆమేరకు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించాడు. మహేశ్వరి కోసం తెలుగుగంగ కాలువలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. మహేశ్వరి కాలువలో గల్లంతవడానికి ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది.

వేడుకగా సామూహిక భజనలు

తిరుపతి కల్చరల్: టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం భజన మండళ్ల సామూహిక భజనలు వేడుకగా నిర్వహించారు. శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం మూడో సత్రం ప్రాంగణంలో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంకీర్తనాలాపన, ధార్మిక సందేశం అందించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రలకు చెందిన సుమారు 3,500 మందికిపైగా భజన మండళ్ల సభ్యులు హరినామ సంకీర్తనల భజనలు చేస్తూ తమ ఆధ్యాత్మికత భావాలను చాటుకున్నారు.

నేడు మెట్ల పూజ

చివరి రోజైన బుధవారం అలిపిరి పాదాల మండపం వద్ద మెట్ల పూజ చేయనున్నారు. ఈమేరకు భజన మండళ్ల సభ్యు లు మూడో సంత్రం నుంచి అలిపిరి పాదాల మండపానికి చేరుకొని మెట్ల పూజలో పాల్గొని భజనలు నిర్వహిస్తారు. అనంతరం సప్తగిరులను అధిరోహించి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

విశ్వాసంతోనే విజయం

భగవంతుడిపై పరిపూర్ణ విశ్వాసం ఉంచి పనులు మొదలు పెడితే తప్పక సఫలీకృతమవుతుందని టీటీడీ జేఈవో సదాభార్గవి తెలిపారు. రాత్రి జరిగిన భజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

వైద్యాధికారి వేధింపులను నిరసిస్తూ వైద్య సిబ్బంది ధర్నా

– ఆత్మహత్యాయత్నంపై ఆర్డీఓ విచారణ


పీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని విచారిస్తున్న ఆర్డీఓ

గూడూరురూరల్: చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నెల్లటూరులో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్‌గా విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది షాలీషా వైద్యాధికారిణి ప్రసూన వేధింపులు తాళలేక సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈమేరకు మంగళవారం చెన్నూరు పీహెచ్‌సీ వద్ద అన్ని క్లస్టర్ల ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది అసోసియేషన్ నాయకులతో కలిసి వైద్యాధికారిణి వేధింపులను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. విషయం తెలిసి గూడూరు ఆర్డీఓ ఎం.కిరణ్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హనుమంతరావు అక్కడి చేరుకుని సంఘటనపై బహిరంగ విచారణ చేపట్టారు. వైద్యాధికారిణి వేధింపులతో మానసికంగా బాధపడుతున్నామని, ఆమెపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఫిర్యాదును కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 24 గంటల్లో చర్యలు తీసుకునేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

గూడూరు డివిజన్

క్లుప్తంగా

గడప గడపలో ఎమ్మెల్యే కిలివేటి



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

తడ: గ్రద్దగుంట పంచాయతీలోని పమర హరిజనవాడ, ఖాశింఖాన్‌కండ్రిగ గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, సర్పంచ్ కాటయ్య, సర్పంచ్ ఆర్ముగం, వైస్ ఎంపీపీ వెంకటేష్, నేతలు అనంత్, అఫ్రిది, మణి, సుబ్బారావు, రాజేంద్ర, మల్లెయ్య, గజేంద్ర, మునేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం...

గూడూరురూరల్: ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం గూడూరు ఆర్టీసీ డిపో వద్ద ఘనంగా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రమణ్యంరాజు జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. యూనియన్ డిపో ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లు సీనియర్ కామ్రేడ్ దుర్గారావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో లబ్ధిదారులకు వెసులుబాటు



ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



తూర్పుకనుపూరులో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి



కాదలూరులో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు

చిల్లకూరు: జగనన్న సురక్ష కార్యక్రమం లబ్ధిదారులకు వెసులుబాటు అని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. చిల్లకూరులోని సచివాలయం -2 పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

గూడూరురూరల్: వాలయానందపురం-2, సత్రపువీధి, తిప్పవరప్పాడులోని చెన్నూరు-1 సచివాలయాల్లో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు.

పేదల పక్షపాతి సీఎం జగనన్న..

చిల్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి కొనియాడారు. తూర్పుకనుపూరు, తమ్మినపట్నం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాల పాల్గొని ధ్రువీకరణపత్రాలను అందజేశారు.

వెంకటగిరి రూరల్ మండలంలో..

వెంకటగిరిరూరల్: వల్లివేడులో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ సేవలు ప్రజల చెంతకే..

తడ: ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటకే చేర్చాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. కాదలూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి కిలివేటి హాజరై పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

అన్నమేడులో..

నాయుడుపేట: అన్నమేడులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి పంపిణీ చేశారు.

సైదాపురం: గులించెర్ల సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో నెల్లూరు జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి ధ్రువీకరణపత్రాలు అందజేశారు.

దక్కిలిలో..

దక్కిలి: వెలికల్లు, పాతనాలపాడు గ్రామాల్లో పలువురికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఉచ్చూరులో..

దొరవారిసత్రం: ఉచ్చూరులో 217 మందికి అవసరమైన సర్టిఫికెట్లు అధికారులు అందజేశారు.

ఓజిలిలో: కుందాం, తిరుమలపూడి, మాచవరం, ముమ్మాయపాళెం గ్రామాల్లో 1,004 మందికి సర్టిఫికెట్లు అందజేశారు.

వాకాడులో..

వాకాడు:కొండాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

రాపూరు మండలంలో..

రాపూరు:గిలకపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం లో జెడ్పీ సీఈఓ చిరంజీవి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అదేవిధంగా బొజ్జనపల్లిలో జగనన్న సురక్ష నిర్వహించారు.

చిల్లకూరులో..

పెళ్లకూరు: చిల్లకూరు సచివాలయ పరిధిలో 1,153 సర్టిఫికెట్లు లబ్ధిదారులకు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అందజేశారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు

దక్కిలి: సాగులో సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. దగ్గవోలులో మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.